# అరుదైన గౌరవం



'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును దక్కించుకున్నారు అగ్ర హీరోలు ఎన్టీఆర్, రామ్ చరణ్. 'నాటు నాటు' పాట ఆస్కార్ అవార్డును సాధించి భారతీయ సినిమా కీర్తిని ప్రపంచానికి చాటింది. ఈ నేపథ్యంలో ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అకాడమీలో కొత్త సభ్యుడిగా జూనియర్ ఎన్టీఆర్ స్థానం సంపాదించుకున్నారు. ఈ విషయాన్ని ఆస్కార్ అకాడమీ తమ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించింది. భారత సినీ పరిశ్రమ నుంచి ఒక్క ఎన్టీఆర్ మాత్రమే కొత్త సభ్యుడిగా చోటు దక్కించుకోడం విశేషం. తెలుగు సినిమాకు లభించిన అరుదైన గౌరమిదని ఎన్టీఆర్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## గౌతమిలో అమ్మను చూశాను

నిత్యామీనన్ తాజా సిరీస్ 'కుమారి శ్రీమతి'కి విశేషాదరణ లభిస్తున్నది. ఈ సందర్భంగా ఆమె తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ' నా లైఫ్‌కి చాలా దగ్గరగా అనిపించే కథ 'కుమారి శ్రీమతి'. 30ఏళ్లు దాటినా పెళ్లి చేసుకోకుండా లక్ష్యం అంటూ తిరిగే పాత్రను పోషించా. నేను కూడా దాదాపు శ్రీమతి టైపే. ఈ సిరీస్‌లో నా తల్లి పాత్ర పోషించిన గౌతమిగారు నన్ను పెళ్లి చేసుకోమని ఒత్తిడి తెస్తూ ఉంటుంది. రియల్ లైఫ్‌లో కూడా మా అమ్మ బతికున్నప్పుడు సేమ్‌టూ సేమ్. 'నువ్వేం సాధించావ్.. ప్రశాంతంగా పెళ్లి చేసుకో.. నీకెందుకు ఈ సినిమాలు' అంటూ తెగ ఇబ్బంది పెట్టేది. ఈ పాత్ర చేస్తున్నప్పుడు గౌతమిగారిలో మా అమ్మను చూశాను' అంటూ చెప్పుకొచ్చింది నిత్యామీనన్.



## అలా చూడటం నిజంగా బాధాకరం

నటి మెహరీన్‌కు కోపం వచ్చింది. తనను ట్రోల్ చేసిన వారిపై ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవలే ఆమె 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ' అనే వెబ్‌సిరీస్‌లో నటించింది. ఇటీవలే స్ట్రీమింగ్ అయిన ఈ సిరీస్‌లో కథ డిమాండ్ చేయడం వల్ల కొన్ని బోల్డ్ సన్నివేశాల్లో నటించింది. ఆ సీన్లు చూసిన కొందరు సోషల్ మీడియా వేదికగా మెహరీన్‌పై ఇబ్బందికరమైన కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. దీనిపై చాలా వరకూ సంయమనం పాటించింది మెహరీన్. అయినా అవి ఆగకపోవడంతో సోషల్ మీడియా వేదికగా స్పందించింది. 'నటన నా ఉద్యోగం. నేను ఓ బాధ్యతను తీసుకున్నప్పుడు దానిపై వందశాతం ఎఫర్ట్ పెట్టాలి. దానికోసం త్యాగాలు కూడా చేయాల్సిన పరిస్థితి. 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ' అద్భుతమైన కథ. స్త్రీలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల్లో వైవాహిక అత్యాచారం ఒకటి. దాని వల్ల ఎందరో స్త్రీలు బాధపడుతున్నారు. ఆ నేపథ్యంలో సాగే కథ 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ'. అందులో ఢిల్లీ సుల్తాన్ క్రూరమైన అత్యాచారాన్ని దర్శకుడు తెరకెక్కించాడు. నేను ఆ సన్నివేశంలో నటించాను. కానీ కొందరు ఆ సన్నివేశంలోని బాధని చూడకుండా ట్రోలింగ్‌కి దిగారు. దాన్నొక శృంగార సన్నివేశంలా వాళ్లు చూడటం నిజంగా బాధాకరం. వాళ్లింట్లో కూడా ఆడవాళ్లుంటారు. అది మర్చిపోకూడదు' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు మెహరీన్.



మెహరీన్

# ఆల్‌రౌండర్ ప్రభాస్



ప్రభాస్ తన తరం హీరోల్లో ఎవరికీ లేని రికార్డును సొంతం చేసుకున్నారు. ఇప్పుడున్న హీరోలందరూ జనరల్‌గా చేసేవన్నీ సాంఘిక కథాంశాలే. అయితే ఈ జనరేషన్‌లో విభిన్నమైన జోనర్స్‌లో నటించే అవకాశం మాత్రం ప్రభాస్‌కే దక్కిందని చెప్పాలి. ప్రభాస్ సాంఘిక చిత్రాలు చాలా చేశారు. అయితే ఈ మధ్యలో 'బాహుబలి' సిరీస్ చేయడంతో నేటి తరంలో జానపద వీరుడిగా నటించిన తొలి హీరోగా నిలిచాడు ప్రభాస్. అలాగే ఓంరౌత్ దర్శకత్వంలో 'ఆదిపురుష్' చేసి, అందులో రాముడిగా కనిపించాడు. మంచు విష్ణు నటిస్తూ, నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రంలోనూ ప్రభాస్ శివుడిగా నటించబోతున్నాడట. ప్రస్తుతం ప్రభాస్ చేస్తున్న చిత్రాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'కల్కి'. ఇది మరో భిన్నమైన కాన్సెప్ట్. ఫిక్షన్ నేపథ్యంలో సాగే కథ. ఇందులోని పాత్రకూ పురాణాలకూ సంబంధం ఉంటుందని టాక్. అంటే సాంఘికాలతోపాటు జానపదం, పౌరాణికం, ఫిక్షన్ పాత్రల్లో నటిస్తూ తన జనరేషన్‌లో ఏ హీరోకీ లేని రికార్డును సొంతం చేసుకున్నారు ప్రభాస్.



వరుణ్‌తేజ్

## వైమానిక వీరుల సాహసాలు

వైమానిక వీరుల పరాక్రమాలను, విధి నిర్వహణలో వారు ఎదుర్కొన్న సవాళ్లను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిస్తున్న ఈ చిత్రానికి శక్తిప్రతాప్ సింగ్ దర్శకుడు. మానుషి చిల్లార్ కథానాయిక. సందీప్ ముద్దా నిర్మాత. డిసెంబర్ 8న విడుదలకానుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. 'భారతదేశం ఎదుర్కొన్న అతిపెద్ద వైమానిక దాడుల నేపథ్యంలో యథార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను తెరకెక్కించాం. దేశభక్తి ప్రధానంగా ఆకట్టుకుంటుంది. 'మేజర్' వంటి విజయం తర్వాత సోనీ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉంది' అని చిత్ర బృందం పేర్కొంది.

## డ్యాన్స్ యూనియన్‌కి భూమిని తీసుకొస్తా



తెలుగు ఫిలిం అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఎన్నికయ్యారు. జానీ మాస్టర్ ప్రమాణ స్వీకారానికి దక్షిణాది డ్యాన్స్ డైరెక్టర్లందరూ హాజరయ్యారు. నిర్మాత మండలి అధ్యక్షుడు, ఫిలింఛాంబర్ సెక్రటరీ కె.ఎల్.దామోదరప్రసాద్ ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యారు. సభ్యుల మంచికోసం గెలిచిన అభ్యర్థులు పనిచేయాలని, ఈ అసోసియేషన్‌కి తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని, పాతవాళ్లను మరిచిపోకుండా ముక్కురాజుగారి కుటుంబసభ్యులను కూడా పిలవడం సంతోషంగా ఉందని దామోదరప్రసాద్ అన్నారు. 'నన్ను దీవించడానికి వచ్చిన సాటి డ్యాన్స్ డైరెక్టర్లందరికీ కృతజ్ఞతలు. ఈరోజు మాకు ఇంత పేరు వచ్చిందంటే, అందరం కార్లలో తిరుగుతున్నామంటే కారణం ముక్కురాజు మాస్టారు. ఆయన దయవల్లే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాం. మేం పిలవగానే ఆయన కుటుంబం నుంచి ఒకరు ఈ కార్యక్రమానికి వచ్చారు. మా డ్యాన్స్ యూనియన్‌లో అందరం ఒక్కటే. మేమంతా ఒక తల్లి బిడ్డలం. మేం వేసే ప్రతి అడుగూ డ్యాన్స్ యూనియన్ అభివృద్ధివైపే ఉంటుంది. యూనియన్‌కి భూమి తీసుకొచ్చే బాధ్యత నాది' అని జానీ మాస్టర్ చెప్పారు. ఇంకా దినేశ్ మాస్టర్ కూడా మాట్లాడారు.

## వెండితెరపై అద్భుతాలు సృష్టించగలదు



ఒకానొక దశలో కరీనాకపూర్ అంటే యువతరం కలలరాణి. ప్రస్తుతమైతే పెళ్లి చేసుకుని వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూ, మంచి పాత్ర దొరికితే అప్పుడప్పుడు మాత్రమే సినిమాల్లో తళుక్కున మెరుస్తున్నది కరీనా. కెరీర్‌లో సూపర్‌స్టార్‌డమ్‌ని ఎంజాయ్‌చేసి, కోట్లాదిమంది యువతకు ఆరాధ్యదేవతగా వెలిగిన కరీనా కూడా ఓ హీరోయిన్ ఫ్యాన్. కరీనా మనసు దోచిన ఆ హీరోయిన్ ఎవరో అనుకుంటున్నారా? తనెవరోకాదు.. అలియా భట్. అవును అలియా అభిమాని కరీనా. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో తన మనసులోమాట చెప్పేసింది కరీనా. 'నాకు నేటి కథానాయికల్లో అలియాభట్ అంటే చాలా ఇష్టం. తను మా ఇంటి అబ్బాయిని చేసుకుందని కాదు. నటిగా తను ఓ రేంజ్. అంతేకాదు, తను ఎంచుకునే పాత్రలు కూడా అద్భుతం. సినిమా సినిమాకీ నటిగా తన స్థాయిని పెంచుకుంటుంది. అలియా, రణ్‌బీర్ పెళ్లి చేసుకోకముందే నేను అలియా ఫ్యాన్‌ని. ఆ విషయం తనకు కూడా చెప్పాను. తనేమో నా ఫ్యాన్‌ని అని అందరికీ చెప్పుకుంటుంది. ఏదేమైనా ఆమెకు మంచి కెరీర్ ఉంది. రణ్‌బీర్ తనని ప్రోత్సహిస్తే వెండితెరపై అద్భుతాలు సృష్టించగల నటి అలియా' అని చెప్పారు కరీనా.

## కులుకులొలుకు సితార



వెంకట్, సాయికుమార్, మోహన సిద్ధిఖి

'బాహుబలి' ప్రభాకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'రౌద్ర రూపాయ నమః'. పాలిక్ దర్శకత్వంలో రావుల రమేష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని సెకండ్ లిరికల్ వీడియో సాంగ్ 'తళుకు తళుకుమను తారా..కులుకులొలుకు సితారా'ను సాయికుమార్ ఆవిష్కరించారు. సురేష్ గంగుల రచించిన ఈ పాటను జాన్ భూషణ్ స్వరపరిచారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ 'టైటిల్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. సినిమాలోని రెండు పాటలను చూశాను. చాలా బాగున్నాయి. మంచి కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం విజయం సాధించాలి' అన్నారు. విభిన్న కథాంశంతో యాక్షన్ ప్రధానంగా చిత్రాన్ని రూపొందిస్తున్నామని దర్శకుడు తెలిపారు.

## ఇప్పటివరకు చూడని హారర్



శ్రీకాంత్ శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటిస్తున్న చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. సాయికిరణ్ దైదా దర్శకుడు. కళాహి మీడియా పతాకంపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ఈ చిత్ర టైటిల్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యువ హీరో శ్రీవిష్ణు ఆవిష్కరించారు. ఇందులో ఓ పాప బల్లపై పడుకొని ఉండటం, చుట్టూ నిల్చొని ఉన్న వ్యక్తులు ఏదో ప్రమాదాన్ని శంకిస్తున్నట్లు కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'మూడు కాలల నేపథ్యంలో నడిచే కథ ఇది. స్క్రీన్‌ప్లే ప్రధానాకర్షణగా నిలుస్తుంది. ఇప్పటివరకు తెలుగులో ఇలాంటి హారర్ కాన్సెప్ట్ రాలేదు. టీజర్‌ను ఈ నెల 30న విడుదల చేస్తాం' అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ మనోహర్, సంగీతం: కృష్ణ సౌరభ్ సూరంపల్లి, దర్శకత్వం: సాయికిరణ్ దైదా.








